## విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలి

రాయదుర్గం: విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిటీ సభ్యుడు, హెచ్‌సీయూ ప్రొఫెసర్ నాగరాజు పేర్కొన్నారు. గౌలిదొడ్డిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం నెలరోజులపాటు నిర్వహించిన ప్రత్యేక శిబిరం ఆదివారం ముగిసింది. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జర్నలిస్టు సొసైటీ అధ్యక్షుడు గోపరాజు మాట్లాడుతూ.. అడ్డంకులను లెక్క చేయకుండా విద్యపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుజన్‌రంజన్‌రావు, ఆచార్య కమలాకర్, డెర్మటాలజిస్ట్ డాక్టర్ అలేఖ్యసింగపూర్ పాల్గొన్నారు.

## బీజేపీ నూతన కార్యవర్గం ఎన్నిక


నియామకపత్రాలు అందజేస్తున్న రాఘవేంద్ర రావు

చందానగర్: బీజేపీ హఫీజ్‌పేట్ డివిజన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం డివిజన్ పార్టీ కార్యాలయంలో జరిగింది. డివిజన్ అధ్యక్షుడిగా కైతాపురం జితేందర్, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, శివాజీ, ప్రసాద్ పాత్రో, శివ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శులుగా జగదీశ్వర్ గౌడ్, రాజు ముదిరాజ్, కార్యదర్శులుగా గిరీష్మా, రాజు యాదవ్, సాయి కళా, సుబ్బారావు, కోశాధికారిగా సుభాష్, కార్యవర్గ సభ్యులుగా విజయ్‌కుమార్, రామారావు, సుబ్బారెడ్డి, సాయి హర్షిత, నాగరాణి, రామ్‌రెడ్డి, రాజు గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, అశుత కులకర్ణి, అశోక్, నర్సింహా, మునికొండ రాజకుమార్, నరేష్‌లు నియమితులయ్యారు. కార్యక్రమంలో బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాఘవేంద్ర రావు పాల్గొన్నారు.

## విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే గూడెంకు ఆహ్వానం


ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండల పరిధిలోని రామేశ్వరంబండ వీకర్ సెక్షన్ కాలనీలో ఈ నెల 6న నిర్వహించ తలపెట్టిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అంబేడ్కర్ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...భవిష్యత్తు తరాలకు మహనీయుల ఆశయాలను అందించాలన్న లక్ష్యంతో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ఆహ్వానం అందజేసిన వారిలో గ్రామ మాజీ సర్పంచ్ అంతిరెడ్డి, అంబేడ్కర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న నిరసనలు


నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డు ఏర్పాటుకు జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు 117వ రోజుకు చేరుకున్నాయి. నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల్లో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. నల్లవల్లి గ్రామంలోని దీక్షా శిబిరంలో స్థానిక మహిళలు పాల్గొని సంఘీభావం తెలిపారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు పనులు నిలిపే వరకు నిరసనలు విరమించమని స్పష్టం చేశారు.

## ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజలు చేస్తున్న శ్రీనివాస్ దంపతులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ పి.వి.శ్రీనివాస్ భెల్ టౌన్‌షిప్‌లోని పెద్దమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు మాజీ వార్డు సభ్యులు గిరి ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఆలయం వద్ద పేదలకు దుప్పట్లు, పాదరక్షలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో సీఎం రేవంత్ రెడ్డి ఈ బాధ్యతలను అప్పగించారని తెలిపారు. నిజాయితీగా తను ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జగదీశ్వర్, నాయకులు పి.వి.భాస్కర్, బాక్సర్ గిరి, శేషగిరి రావు, ఫణీ , సునీల్, నిరంజన్‌లు పాల్గొన్నారు.

# సర్వర్ డౌన్

### రేషన్ పంపిణీకి బ్రేక్ • తొలిరోజు లబ్ధిదారులకు నిరాశ



మూసివేసిన లింగంపల్లిలోని రేషన్ షాపులు


మదీనాగూడలోని రేషన్ షాపులో మొరాయించిన బయో మెట్రిక్

శేరిలింగంపల్లి జోన్ బృందం: సర్వర్ డౌన్ కావడం, బయో మెట్రిక్ యంత్రాలు మొరాయించడంతో మూడు నెలల రేషన్ పంపిణీకి తొలి రోజు బ్రేక్ పడ్డట్లయ్యింది. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా మూడు నెలల రేషన్ పంపిణీ ఉన్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రేషన్ షాపులను సాక్షి విజిట్ చేయగా అనేక చోట్ల షాపులు మూసి వేసి ఉన్నాయి. శేరిలింగంపల్లి పరిధిలో అంతటా సాంకేతిక లోపంతో రేషన్ బియ్యం పంపిణీ చేయలేకపోయారు. మూడు నెలల బియ్యం ఒకేసారి రావడంతో ఉదయాన్నే లబ్ధిదారులు రేషన్ షాపులకు వెళ్లారు. సర్వర్ల డౌన్‌తో డీలర్లు, రేషన్ కోసం వచ్చిన జనం నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. రెండు గంటలపాటు రేషన్ షాపుల వద్దే జనం ఉన్నా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో వారంతా తిరిగి ఇళ్లకు వెళ్లి పోవాల్సిన పరిస్థితి నెలకొంది. శేరిలింగంపల్లి మండల పరిధిలో దాదాపు 54 రేషన్ షాపులు ఉన్నాయి. ఏడెనిమిది చోట్ల కొద్ది సేపు రేషన్ ఇచ్చారని చెబుతున్నా అధికారులు మాత్రం స్పష్టత ఇవ్వడం లేదు. శేరిలింగంపల్లి, కొండాపూర్ , గచ్చిబౌలి, రాయదుర్గం, మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట్, చందానగర్ డివిజన్లలోని రేషన్ షాపులు సాంకేతిక కారణాలతో రేషన్ షాపులను మూసి వేశారు. మూడు రోజుల క్రితమే బియ్యం కోటా వచ్చినప్పటికీ సాంకేతిక కారణాల దృష్ట్యా పంపిణీ చేయలేకపోయామని డీలర్లు పేర్కొంటున్నారు.

- సర్వర్ డౌన్‌తో శేరిలింగంపల్లిలో పని చేయని బయోమెట్రిక్
- మెజారిటీ రేషన్ షాపులు మూసివేత
- బియ్యం తీసుకోకుండానే తిరిగి వెళ్లిన జనం
- బియ్యం పంపిణీపై సాక్షి విజిట్

### మూసి ఉన్న రేషన్ షాపులు

శేరిలింగంపల్లి మండల పరిధిలోని అన్ని రేషన్ షాపుల వద్ద సర్వర్లు పనిచేయలేదు. మాదాపూర్ ఇజ్జత్‌నగర్, నానక్‌రాంగూడ, ఖాజాగూడ, రాయదుర్గం, మియాపూర్, మదీనాగూడ, జేపీఎన్‌నగర్, గచ్చిబౌలి,హఫీజ్‌పేట్, లింగంపల్లి తోపాటు ఇతర ప్రాంతాలలో ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో రెండు గంటలపాటు వేచి చూసినా పరిస్థితి ఎలాంటి మార్పులు రాకపోవడంతో అంతా ఇక వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. మదీనాగూడ రేషన్ షాపు నెంబర్ 646లో కొద్ది సేపు బియ్యం పంపిణీ చేశారు. జేపీఎన్‌నగర్‌లోని షాపు నెంబర్ 387, మియాపూర్ లోని షాపు నెంబర్ 67, గచ్చిబౌలిలోని షాపు నెంబర్ 69, ఇజ్జత్‌నగర్‌లో షాపు నెంబర్ 232, హఫీజ్‌పేట్‌లోని షాపు నెంబర్ 409, లింగంపల్లిలోని రేషన్ షాపులు ఉదయం మూసివేసి ఉన్నాయి.


హఫీజ్‌పేట్‌లో మూసి ఉన్న రేషన్ దుకాణం

### షాపుల్లో బియ్యం

సర్వర్ డౌన్‌కావడం, బయో మెట్రిక్‌లో సమస్యల కారణంగా తలెత్తిన సమస్య పరిష్కారం కాగానే బియ్యం పంపిణీ చేస్తామని గచ్చిబౌలి రేషన్ షాపు నెంబర్ 69 డీలర్ ప్రకాష్ తెలిపారు. ఉదయం నుంచి మిషన్ పని చేయకపోవడంతో షాపు తెరువలేదన్నారు. మూడు నెలల రేషన్ పంపిణీ కోసం షాపులో స్టాక్ పెట్టాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. నెల స్టాక్ కోసం ఏర్పాటు చేసిన షాపులో మూడు నెలల రేషన్ పెట్టలేమన్నారు. వచ్చిన రేషన్ పంపిణీ చేయగానే వెంటనే మళ్లీ బియ్యం అందుబాటులో ఉంచుతామన్నారు.

### సాంకేతిక సమస్యతో పంపిణీకి ఆటంకం

సాంకేతిక లోపంతో శేరిలింగంపల్లి మండల పరిధిలో మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ చేయలేకపోయామని ఏఎస్‌ఓ పుల్లయ్య తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల వరకు కొన్ని చోట్ల రేషన్ పంపిణీ చేశామన్నారు.ఎస్య పరిష్కారం కాగానే లబ్ధిదారులందరి రేషన్ ఇస్తామన్నారు. ఎన్ని చోట్ల రేషన్ పంపిణీ చేశారు, ఎన్ని చోట్ల రేషన్ షాపులు మూసివేశారు అనే ప్రశ్నకు ఆయన సమాధానం దాటవేశారు.

### సాంకేతిక సమస్య

మూడు నెలల రేషన్ పంపిణీ కోసం కొత్త సాఫ్ట్‌వేర్ కావడంతో సమస్యలు తలెత్తినట్లు తెలుస్తోంది. ఒకటి రెండు చోట్ల కొద్ది సేపు రేషన్ పంపిణీ చేసినట్లు చెబుతున్నారు. ప్రతి నెలా కోటాలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే బియ్యం కోసం రెండు సార్లు థంబ్ వేయాల్సి ఉంటుంది. జూన్, జూలై, ఆగస్టు మూడు నెలల కోటా తీసుకోవాలంటే ఆరు సార్లు తంబ్ వేస్తేనే కోటా ఇచ్చేందుకు వీలుంటుంది. బయో మెట్రిక్ యంత్రాలు ఇకే సారి ఆరు తంబ్‌లు తీసుకోకపోవడంతో సమస్య తలెత్తింది. దీంతో ఇళ్లలోనే మిషన్లను పరిశీలించిన కొందరు డీలర్లు షాపులు కూడా తెరువలేదు.


జేపీఎన్‌నగర్ రేషన్ షాపు ముందు సాయంత్రం క్యూకట్టిన జనం

### పంపిణీలో ఆలస్యం



లబ్ధిదారులు క్యూ లేన్‌లో గంటల సమయం నిలబడాల్సి వస్తుంది. వేలిముద్రలు వేసేందుకు, బియ్యం ఇచ్చేందుకు ఒకొక్కరికి 30 నిమిషాల సమయం పడుతుంది. మూడు నెలల రేషన్ ఒకే సారి ఇవ్వడం మంచిదే అయినప్పటికీ అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.
– రమేష్ లబ్ధిదారుడు

## ఉగ్రవాదుల అంతమే ఆపరేషన్ సిందూర్ లక్ష్యం

ఆల్విన్‌కాలనీ: ఉగ్రవాదుల అంతమే ఆపరేషన్ సిందూర్ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆల్విన్‌కాలనీలోని సాయినగర్‌లో శనివారం తిరంగా ర్యాలీని యూత్ అధ్యక్షులు లంగటి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో, కుమార్ యాదవ్, శ్రీనాథ్‌ల అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ విజయం చరిత్రలో మరిచిపోలేనటువంటి దినమన్నారు. భారత్‌పై పాకిస్థాన్ ఎన్ని కుట్రలు చేసినా ఆ దేశానికి ఎదుర్కొనే శక్తి లేదన్నారు. ఉగ్రవాదుల ఎయిర్ బేస్‌లను కూల్చి ఉగ్రవాదుల గుండెల్లో వణుకు పుట్టేలా మన సైనికులు పని చేశారన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్‌రావు, డాక్టర్ కొరడాల నరేష్, నాయకులు రామరాజు, దుర్గప్రసాద్, ఎత్తరి రమేష్, వివిధ కాలనీల కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

## 'ప్రజాసంక్షేమమే ధ్యేయం'


ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని కలిసిన అపార్ట్‌మెంట్ వాసులు

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని మందాడి మాగ్నస్ అపార్ట్‌మెంట్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు.నూతన అసోసియేషన్ సభ్యులను ఎన్నుకున్న సందర్భంగా ఎమ్మెల్యేను కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. కాలనీలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు రామ సుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు సుదాకర్‌రెడ్డి, వెంకట్, నాగరాజు, దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో కల్యాణోత్సవం


టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న ఆలయ ధర్మకర్త జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో జాతర ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వి.పూజిత జగదీశ్వర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో చేపట్టిన ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అదే విధంగా బోనాలు, పోతరాజుల విన్యాసాలు, కళాకారుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ ప్రభుత్వ సలహా దారులు షబ్బీర్ అలీ, పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీ, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ ఎం.ఎస్ ప్రభాకర్, మాజీ ఎంపీ మధు యాష్కీ, మాజీ మేయర్ బొంతు రాంమోహన్, మాజీ ఎమ్మెల్యేలు కూన శ్రీశైలం గౌడ్, డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, రోహిన్ రెడ్డి, కార్పొరేషన్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు




శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం కాలిఫోర్నియా నుంచి వచ్చిన భరతనాట్య కళాకారిణి తాన్యము ద్దన ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. ప్రముఖ కూచిపూడి నాట్యగురువు నిర్మల్ విశ్వేశ్వర్‌రావు శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. – మాదాపూర్

## క్రీడలతో మానసికోల్లాసం

### మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్

జిన్నారం (పటాన్‌చెరు): క్రీడతో మానసికోల్లాసం కలుగుతుందని జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ అన్నారు మండలంలోని శివానగర్‌కు చెందిన నిర్నాల సత్యనారాయణ ఆదివారం క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత మద్యం, ఇతర వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందన్నారు. నేటి యువతలో నూతన ఉత్సాహం నింపేందుకు టోర్నమెంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు సత్యనారాయణను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, గంగు రమేష్, కృష్ణ, మహేష్, వెంకటేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ముగిసిన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు


చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల శివారులో ఉన్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. గత నెల 28వ తేదీన ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ఆదివారంతో పూర్తయ్యాయి. చివరిరోజు ఆదివారం ఉదయం మహాపూర్ణాహుతి, చక్రస్నానం, సాయంత్రం అశ్వవాహన సేవ, దేవతా విసర్జన, రుత్విక్‌సన్మానం నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా శనివారం రాత్రి దేవాలయం ఆవరణలో కొత్తగా తయారు చేయించిన రథంపై స్వామి వారిని ఉంచి దేవాలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం శేషవాహన సేవ నిర్వహించారు. వారం రోజులుగా ఆలయ ప్రాంగణం వేద పండితుల మంత్రోచ్ఛరణలు, హోమాలతో మారుమోగింది. ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన మంచిరేవుల గ్రామస్తులతో పాటు నిర్వాహణ కర్త సంతోష్‌రెడ్డిలకు అర్చకులు గూడా శ్రీనివాసాచార్యులు, వరదరాజాచార్యులు, రాజగోపాలాచార్యులు అభినందించారు.

# ఆహ్లాదం ఆవిరి.. నిర్వహణ గాలికి

- పార్కుల్లో పచ్చదనం దెబ్బతిని, మూలనపడ్డ పరికరాలు
- పట్టించుకోని అధికారులు, సిబ్బంది
- కబ్జాకు గురవుతున్న పార్కులు

జిన్నారం(పటాన్‌చెరు): పచ్చదనాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పర్యావరణ శాస్త్రవేత్తలు చెబుతుంటే అవేమీ పట్టనట్లుగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వం నిధులు కేటాయించి.. పట్టణ ప్రగతిలో ఆరు పార్కులను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం పార్కుల నిర్వహణ పరిస్థితి దయనీయంగా మారింది.

### నిర్వహణ లోపం..

పట్టణ ప్రగతిలో ఏర్పాటు చేసిన పార్కులను అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి గురి చేశారు. హరితహారం పేరిట మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను విస్మరించారు. దీంతో పార్కుల్లో చెట్లు, పూల మొక్కలు పూర్తిగా సంరక్షణ లేక ఎండిపోసాగాయి. కనీసం అధికారులు పర్యవేక్షించకపోవడంతో పార్కుల దుస్థితి అస్తవ్యస్తంగా మారింది.

### మూలనపడ్డ పరికరాలు

పలు పార్కుల్లో ప్రభుత్వం నిధులు వెచ్చించి పచ్చదనాన్ని పెంపొందించే పరికరాలను ఏర్పాటు చేసింది. అత్యధిక పార్కుల్లో పచ్చదనం దెబ్బతినగా.. పరికరాలు మూలనపడ్డాయి. కొన్ని పార్కుల్లో అసలు పరికరాలే ఏర్పాటు చేయకుండా వదిలేశారు. కనీసం పార్కులు ప్రజలకు ఏవిధంగా ఉపయోగపడుతున్నాయో కూడా అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడం గమనార్హం. పారిశ్రామికవాడలో పార్కుల దుస్థితిపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కాలుష్యాన్ని తట్టుకునేందుకు పార్కులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిసినా సరే అధికారులు సిబ్బంది అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తున్నారు.


నిర్వహణ లేని పట్టణ ప్రకృతి వనం

### పార్కు స్థలాలు కబ్జాకు ప్రయత్నాలు

పట్టణ ప్రగతిలో ప్రజలకు ఉపయోగకరంగా ఉండేందుకు పార్కులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తే అందుకు విరుద్ధంగా పరిస్థితులు మారుతున్నాయి. సర్వే నంబర్ 36, 39లో పార్కుల నిర్వహణ లోపంతో అధికారులు సిబ్బంది అటువైపుగా కన్నెత్తి చూడడం లేదని పసిగట్టిన అక్రమార్కులు పార్క్ స్థలాలను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. ఇప్పటికే పార్కు కోసం కేటాయించిన స్థలాల్లో దర్జాగా రోడ్లను ఏర్పాటు చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో భూముల రేట్లు కోట్లు పలుకుతున్నాయని గ్రహించిన అక్రమార్కులు పార్క్ స్థలాలను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మేలుకొని పార్కులను అభివృద్ధి చేసి వాడుకలోకి తీసుకువస్తే ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు ఆస్కారం ఉంటుందని ప్రజలు వాపోతున్నారు.

### యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తాం

మున్సిపాలిటీలోని పార్కుల నిర్వహణకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే అన్ని పార్కులను పరిశీలించాం. స్పెషల్ ఆఫీసర్‌తో చర్చించి నిధులు కేటాయిస్తాం. తద్వారా పార్కుల నిర్వహణకు టెండర్లు పిలుస్తాం. పార్కుల అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం. మున్సిపాలిటీలోని ప్రధాన చౌరస్తాలో జంక్షన్‌లు ఏర్పాటు చేసేందుకు ప్లాన్ రెడీ చేస్తున్నాం.
– మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, బొల్లారం